ఏపి వీక్లీ
apweekly.com
ప్రవాసాంధ్ర

# మస్తాన్‌బాబుకు ఐఎఫ్‌సి సన్మానం



(ఎడమనుంచి కుడికి వరుసగా) ప్రసాద్ తోటకూర, రాజారెడ్డి, మల్లి మస్తాన్‌బాబు, డాక్టర్ నవనీత కృష్ణ గొర్రెపాటి, డాక్టర్ యోగి చిమట

టెక్సాస్: ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్షిప్ కౌన్సిల్ (ఐఎఫ్‌సి) ఆధ్వర్యంలో టెక్సాస్‌లోని ఇర్వింగ్ భీమాస్ రెస్టారెంట్‌లో ఈనెల 27న ప్రపంచరికార్డు సాధించి, గిన్నిస్‌బుక్‌లో నమోదుకానున్న పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబుకు ఘనసన్మానం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణలో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), ఇండియన్ అసోయేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (ఐఎఎన్‌టి), తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్), కార్వస్ కంపెనీ, ఫన్ ఏషియా భీమాస్ రెస్టారెంట్ పాలు పంచుకున్నాయి.

సభకు టెక్సాస్ స్టేట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ ఎల్ఎఫ్‌సి ప్రసాద్ తోటకూర స్వాగతం పలికి, మస్తాన్‌బాబును పరిచయం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా గాంధీగానసంఘం అనే చిన్న గ్రామంలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో మస్తాన్ బాబు జన్మించారని, కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేసి, జెంషెడ్‌పూర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ (1992-96), ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ఎలక్ట్రానిక్స్ (1996-98) చేశారని, అనంతరం కలకత్తాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్‌లో పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లమా ఇన్ మేనేజిమెండ్ (2002-04) చేశారని వివరించారు. సత్యం కంప్యూటర్ సర్వీసెస్‌లో 1998-2001 మధ్య సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారని చెప్పారు.

మస్తాన్‌బాబు సాధించిన ఘనవిజయాలను వివరిస్తూ, 2006లో కేవలం 172రోజుల కాలవ్యవధిలో ప్రపంచంలోని ఏడుఖండాల్లోని ఎత్తైన పర్వతాలను అధిరోహించి ప్రపంచరికార్డు స్థాపించారన్నారు. ఏడు ఖండాల్లోనూ ఇటువంటి అధిరోహణ చేసిన తొలి భారతీయునిగా, ఆంధ్రునిగా కూడా చరిత్రలో నమోదయ్యారని చెప్పారు. వేరెవేరువారాల్లో, వరుస నెలల్లో పర్వతారోహణ చేసి మరో రికార్డు నెలకొల్పారని చెప్పారు. వీటితోపాటు అంటార్కిటికాలోని అతిపెద్ద శిఖరమైన మౌంట్ విన్సన్ మాసిఫ్‌ను అధిరోహించిన తొలి భారతీయుడు అతనేనని చెప్పారు. అథ్లెటిక్స్‌లో మస్తాన్ బాబు సాధించిన విజయాలను, పొందిన అవార్డులను కూడా సభకు తెలియజేశారు.

అనంతరం తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ నవనీత కృష్ణ గొర్రెపాటి, టాన్‌టెక్స్ ప్రెసిడెంట్ (ఎలక్ట్) రాజారెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ యోగి చిమట, ఐఎఫ్‌సి రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసాద్ తోటకూర తదితరులు మస్తాన్‌బాబును దుశ్శాలువతో సత్కరించి, 'ప్రైడ్ ఆఫ్ ఇండియా' బిరుదును అందజేశారు. తనకు జరిగిన సన్మానానికి మస్తాన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ యోగి చిమట వందన సమర్పణ చేశారు.